క్లుప్తంగా

వాల్మీకి గుహల్లో పర్యాటకుల సందడి



కర్ణాటక నుంచి వచ్చిన పర్యాటకులు

ప్యాపిలి: మండల పరిధిలోని వాల్మీకి గుహల్లో పర్యాటకుల సందడి నెలకొంది. శని, ఆది వారాలు సెలవు రోజులు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. గుహల్లోని అద్భుత దృశ్యాలను చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఈ సందర్భంగా పలువురు పర్యాటకులు మాట్లాడుతూ.. సహజ సిద్ధంగా వెలసిన వాల్మీకి గుహలు కట్టిపడేస్తున్నాయని తెలిపారు. గుహల లోపల వెలసిన స్వయంభూ శివలింగాకృతి దర్శించుకుని మధురానుభూతి పొందినట్లు తెలిపారు.

తహసీల్దార్‌గా బాల ఈశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల: మండల తహసీల్దార్‌గా బాల ఈశ్వరరెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సునీతాబాయి తిరిగి సొంత జిల్లాకు వెళ్లిపోవడంతో ఇక్కడ పోస్టు ఖాళీ ఏర్పడింది. రెండు వారాల తర్వాత మండలానికి తహసీల్దార్‌ను నియమించారు. సీసీఎల్‌లో ఉన్న బాల ఈశ్వరరెడ్డిని జిల్లాకు కేటాయించడంతో కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది.

కర్ణాటక మద్యం స్వాధీనం

బేతంచెర్ల: పట్టణంలోని నంద్యాల క్రాస్ రోడ్డు గురవయ్య పెట్రోల్ బంక్ సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పోలీసులను చూసిన కోట సావిత్రి అనే మహిళ 14 టెట్రా ప్యాకెట్లను వదిలేసి పారిపోయింది. మద్యంను స్వాధీనం చేసుకుని.. కోట సావిత్రిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

ఒకటో తేదీనే పెన్షన్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్

డోన్: ప్రభుత్వ పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యదర్శి భానుసింగ్ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధాప్యంలో అనేక రుగ్మతలతో బాధపడుతున్న పెన్షనర్లకు సకాలంలో పెన్షన్ రాకపోతే ఇబ్బందులు పడతారని తెలిపారు. సంఘం నాయకులు గాలయ్య, సుబ్బరాయుడు, రామదాస్‌రెడ్డి, గోపాల్, మౌలాలి, జయరాముడు, తిమ్మయ్య, చెన్నకేశవులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివ నారయణదాసు

సంజామల: మండల కేంద్రంలోని మాదిగపేటలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాదిగ శివ నారయణదాసు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆగస్టు 1 నుంచి 20వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ కమిటీలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మిద్దె వెంకట రాముడు, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు మండ్ల వెంకట కృష్ణయ్య మాదిగ, రామాంజనేయులు, బాలయ్య మాదిగ, చింతమాను కంబగిరి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డోన్ టౌన్: మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామంలో ఆదివారం స్ఫూర్తి సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయ, పట్టణానికి చెందిన వైద్య పాలీక్లీనిక్ సంయుక్తంగా శిబిరాన్ని నిర్వహించాయి. కంటి వైద్య నిపుణులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి 25 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరం ఉన్నట్లు నిర్ధారించారు. వీరికి కర్నూలు సుశీల నేత్రాలయం ఆస్పత్రికి తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు మధు, సభ్యులు రాము, భాస్కర్, నారాయణ స్వామి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవ‘సాయం’ ఏదీ?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతుకు సాయం
- కూటమి ప్రభుత్వంలో దక్కని భరోసా
- పంటల సాగుపై ప్రభావం
- అన్నదాత సుఖీభవ కోసం ఎదురు చూస్తున్న రైతులు

ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. ఎన్నికల్లో రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా ఆ ఊసే ఎత్తడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవగా పేరు మార్పు తప్పా పెట్టుబడి సాయాన్ని మరిచిందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సంజామల: దేశానికి వెన్నముక రైతు అంటారు. అలాంటి రైతుకు కూటమి ప్రభుత్వంలో అవస్థలు తప్పడం లేదు. ఖరీఫ్‌లో అరకొరగా కురుస్తున్న వర్షాలకు రైతులు సాగుకు సమాయత్తవుతున్న తరుణంలో రాష్ట్రం నుంచి రైతులకు ఎలాంటి సాయం అందడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రైతులకు అన్నదాత సుఖీభవా పథకం పేరుతో ఏటా పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తానని కూటమి పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చినా రైతుల గోడు పట్టించుకోవడంలేదు. సంజామల మండలంలో సమారు 46,500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇప్పటి వరకు మండలంలో 9 వేల ఎకరాల్లో రైతులు పంటల సాగు చేశారు. వరి, మిర్చి, మినుము, కంది, పెసర, పొగాకు తదితర పంటల సాగుకు పూనుకున్నారు. చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారు. అయితే ప్రభుత్వం పెట్టుబడి సాయంపై చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

రైతులు పంట సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా పథకాన్ని అమలు చేసేది. పీఎం కిసాన్ కింద రూ.6వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 రైతు ఖాతాల్లో నగదు జమ చేసేది. అంతేకాకుండా కౌలుకు సాగు చేసుకుంటున్న రైతులను అదుకోవాలనే పెద్ద మనస్సుతో ఏడాదికి రూ.13,500 జమ చేసి భరోసా కల్పించింది.

తప్పని ఎదురు చూపులు

ప్రస్తుతం రైతులు పంటల సాగుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు ఇప్పటికే వివిధ పంటలు సాగు చేశారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో పెట్టుబడి సాయం అవసరం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా రైతన్నలపై దృష్టిసారించకపోవడంతో పెట్టుబడి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.



ముక్కమల్ల గ్రామంలో నాటిన వరి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రైతు భరోసా వివరాలు

ఏడాది	రైతులు	చెల్లించినమొత్తం (రూ.కోట్లలో)
2019-20	9359	12.63
2020-21	8857	11.95
2021-22	8851	11.94
2022-23	8132	10.97
2023-24	8159	11.01

భరోసా ఏదీ?



గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తి కావస్తున్నా పెట్టుబడి సాయం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సరికాదు. నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఎరువులు, విత్తనాలు తెచ్చుకున్నాను. ఖర్చులు పెరిగాయి. త్వరగా రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే పంట సాగుకు ఉపయుక్తంగా ఉంటుంది.

–వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, గిద్దలూరు, సంజామల

హామీ అమలు చేయాలి



కూటమి అధికారంలోకి వస్తే ఏటా పంటల సాగుకు రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. అయితే ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదు. అందరికీ అన్నం పెట్టే రైతుకు భరోసా ఇవ్వకపోతే ఎలా వ్యవసాయం చేస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి రైతులను ఆదుకోవాలి. గత ప్రభుత్వం సకాలంలో పెట్టిబడి సాయం అందించి భరోసా కల్పించింది.

–చాకలి మధుసుధాకర్, రైతు, ఆకుమల్ల గ్రామం

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: స్థానిక పేరంటాలమ్మ గుడి సబ్‌స్టేషన్ పరిధిలోని మల్లెంపల్లె ఫీడర్ కింద 11 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మంపల్లె, మల్లెంపల్లె గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులకు ఇచ్చే త్రీ ఫేస్ కరెంటు తెల్లవారు జామున 3 గంటల నుంచి 9 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం

కోవెలకుంట్ల: విజయవాడలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పాలపై దాడికి యత్నించడం అమానుషమని జాతీయ గిరిజన భవిష్యత్ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు కాంఢ్లావత్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, భావితరాలకు స్ఫూర్తిగా, దిక్సూచిగా పెట్టిన విగ్రహమన్నారు. కూటమి నాయకులు ఆ విగ్రహాన్ని కూల్చి వేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

అమ్మకి వందనం అమలు కోసం పోరాటాలు

డోన్ టౌన్: విద్యారంగ పరిరక్షణతో పాటు ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమాలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్‌ఎం నాయక్, నక్కి శ్రీకాంత్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎస్ఎఫ్ఐ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ప్రతి విద్యార్థి తల్లికి అమ్మకి వందనం కింద రూ.15 వేలు ఇవ్వాలని, విద్యాభివృద్ధి కోసం అధిక బడ్జెట్ కేటాయించాలని, డోన్‌లో మహిళా కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన మైనింగ్ కళాశాల, కేంద్రీయ విశ్వ విద్యాలయం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

డోన్ మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయ్‌నాయక్, ఉపాధ్యక్షులుగా అక్బర్‌బాషా, మాబు, శ్రీకాంత్, కార్యదర్శిగా అశోక్, సహాయ కార్యదర్శులుగా గణేష్, రంగా నాయక్, మహేంద్రతో పాటు 19 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



నూతన కమిటీ సభ్యులు

మట్టి వినాయకులనే పూజిద్దాం



మాట్లాడుతున్న గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేసి పూజించాలని పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరి హుసేన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉత్సవ కమిటీ, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. విగ్రహాలు ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు అందరూ నిబంధనలు పాటించాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఊరేగింపు నిర్వహించాలని తెలిపారు. స్వచ్ఛందంగా మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కమిటీ సభ్యులు హరి, నాగ మోహన్, వీరారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పవన్, అజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం బాలింతలు, రోగులు, గర్భిణులు, వారి సహాయకులకు తెలంగాణ రాష్ట్రం నల్గొండ పట్టణానికి చెందిన జూలి, మాణిక్యమ్మ ఆర్థిక సహకారంతో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. స్థానిక ఆదరణ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జాన్‌ప్రభాకర్ ఆధ్వర్యంలో రొట్టెలు, గుడ్లు, పప్పు పంపిణీ చేశారు. అలాగే ఆదరణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మాంసాహారంతో కూడిన ఆహారాన్ని అందజేశారు.



రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న దాత

వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: సంజామల: మండలంలో వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల విద్యుత్ సరఫరా వేళలు వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డి పల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ వారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో వ్యవసాయ రంగానికి ఈ వారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్ల పరిధిలోని రైతులు గమనించాలని సూచించారు.

తరచుగా విద్యుత్ వైర్లకు మంటలు

- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ లేని రక్షణ గోడలు
- భయాందోళన చెందుతున్న ప్రజలు

డోన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. దీంతో సమీప ప్రాంతాల్లో నివసించే వారు, అటువైపు వెళ్లే పాదాచారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పలు ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో వాటి చుట్టూ చెత్త, చెదారాన్ని కుప్పలుగా పోస్తున్నారు. కొందరు ఆ కుప్పలకు నిప్పు అంటిస్తుండడంతో ప్లాస్టిక్ ఇన్సులేటెడ్ వైర్లు మంటలకు అంటుకుని మీటర్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలు వ్యాపిస్తున్నాయి. మరికొన్ని సందర్భాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కూడా ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం స్థానిక కోట్ల సుజాతమ్మ నగర్ వెనుక ప్రాంతంలో ఉన్న మసీదు వద్ద విద్యుత్ మీటర్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోయింది. గత వారం ఎస్‌కేపీ స్కూల్ వెనుక ప్రాంతంలోని శ్రీసుధ విద్యాలయం వద్ద విద్యుత్ స్తంభం ఉన్న ప్రాంతంలో చెత్తకు కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో స్తంభానికి ఉన్న డిష్, ఇంటర్నెట్ వైర్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



సుజాతమ్మ నగర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లకు మంటలు



ఎస్‌కేపీ హైస్కూల్ వద్ద విద్యుత్ పోల్‌కు ఉన్న డిష్, ఇంటర్నెట్ వైర్లు దగ్ధమవుతున్న దృశ్యం

ఈరోజు

సర్పంచ్‌లకు శిక్షణ

బేతంచెర్ల: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు 19 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు తప్పక హాజరుకావాలన్నారు. ఇందులో 2024–25 గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుద్ధ్యం నిర్వహణ తదితర వాటిపై శిక్షణ ఉంటుందన్నారు.

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీ తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, పారిశుద్ధ్యం, ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు.

డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. 9959225798 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

క్రైం కార్నర్

దంపతులపై దాడి

కొలిమిగుండ్ల: స్థానిక మోడల్ స్కూల్ సమీపంలోని కాలనీలో ఉంటున్న దంపతులపై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. వివరాలు.. ఎస్సీ కాలనీకి చెందిన చిన్న కాంతకు జయమ్మతో సుమారు పదిహేడేళ్ల క్రితం వివాహం జరిగింది. మనస్పర్థలు రావడంతో రెండేళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. విడాకులు ఇవ్వాలని భార్యపై ఒత్తిడి చేస్తుండడంతో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే భార్య సోదరుడు కంబగిరిస్వామి ఇంటి వద్దకు వెళ్లిన చిన్నకాంతు అతనిపై దాడికి పాల్పడ్డాడు. కత్తితో దాడి చేసేందుకు యత్నించగా భార్య సరస్వతి అడ్డు రావడంతో ఆమె చేతికి గాయాలయ్యాయి. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు ఆదివారం గ్రామ శివారులోని ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ. 10,500 నగదు స్వాధీనం చేసుకుని పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సేవకులకు సత్కారం

డోన్: డోన్ కేంద్రంగా పనిచేస్తున్న ద్రోణాచలం సేవా సమితి చేపడుతున్న అనేక సామాజిక సేవా కార్యక్రమాలను అభినందిస్తూ నంద్యాల పట్టణానికి చెందిన ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం సేవా సమితి సభ్యులను ఘనంగా సత్కరించింది. రామక్రిష్ణ విద్యాలయ ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ఆత్మీయ సేవా సంస్థ నిర్వాహకురాలు స్వాతి మాట్లాడుతూ.. అనేక మంది అభాగ్యులు, అనాథలు, వృద్ధులు, వితంతువులను ఆదుకోవడం అభినందనీయమని కొనియాడారు. ముఖ్యంగా అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు చేయడం గొప్ప విషయమన్నారు. ద్రోణాచలం సేవా సమితి ముఖ్య సలహాదారు షేర్షా, తిరుపాలును ఘనంగా సత్కరించారు.



షేర్షాను సత్కరిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు



నరసింహస్వామిని ఆలయ మాడవీధుల్లో ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

వైభవంగా స్వాతి వేడుకలు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశ స్నపనం, నరసింహ హోమం, తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం నిర్వహించారు. అనంతరం అలంకార ప్రియుడైన స్వామివారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు కళ్యాణ చక్రవర్తి, అర్చకులు మద్దిలేటిస్వామి, మనోహర్, రాఘవయ్య పాల్గొన్నారు.



గూటుపల్లెలో నారుమడిని సిద్ధం చేస్తున్న రైతు



వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

బేతంచెర్ల: మండలంలో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా గడుపుతున్నారు. యంబాయి, శంకలాపురం, గూటుపల్లె, ఆర్ఎస్‌రంగాపురం, ముద్దవరం, హెచ్ కొట్టాల, గోరుమానుకొండ గ్రామాల్లో బోరుబావుల కింద వరినారు నాటేందుకు మడులను సిద్ధం చేస్తున్నారు. మరికొందరు నాట్లు వేస్తున్నారు. రైతన్నలు బోరుబావుల కింద వరి, ఉల్లినాట్లు వేస్తున్నారు.



చింతలాయిపల్లె వద్ద ఏర్పడిన గుంతలో నిల్వ చేరిన నీరు



ఎస్.చెన్నంపల్లె సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

ఛిద్రమైన ప్రధాన రహదారులు

కొలిమిగుండ్ల: నిత్యం వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే ప్రధాన రహదారులు ఛిద్రం కావడంతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ చేరడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. దెబ్బతిన్న రోడ్లపై రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే భయబ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని తిమ్మనాయినపేట జంక్షన్ నుంచి ఎస్.చెన్నంపల్లె, చింతలాయిపల్లె మీదుగా అంకిరెడ్డిపల్లె వరకు సింగిల్ రోడ్డు ఉంది. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పెరుగుతున్నాయి. తిమ్మనాయినపేట జంక్షన్ నుంచి చింతలాయిపల్లె వరకు రోడ్డు దెబ్బతిని గుంతల మయంగా మారింది. రెండు వాహనాలు ప్రయాణించాలంటే కష్టసాధ్యమవుతుంది. కొలిమిగుండ్ల నుంచి నాయినపల్లె మీదుగా పెట్నికోట వరకు చాలా చోట్ల గుంతలు ఏర్పడడంతో వాహన దారులకు రవాణ కష్టంగా మారుతోంది. కొలిమిగుండ్ల నుంచి మీర్జాపురం వరకు గతంలో రోడ్డు ఏర్పాటైనా ప్రస్తుతం అక్కడక్కడ దెబ్బతింది. మీర్జాపురం నుంచి సంజామల మండలం రామిరెడ్డిపల్లె, పేరుసోముల వరకు రోడ్డు సౌకర్యం లేదు. ఈరోడ్డును ఆధునీకరిస్తే రవాణ సౌకర్యం పెరిగి ప్రజలు కష్టాలు తీరుతాయి. ఇటిక్యాల నుంచి చింతలాయిపల్లె, అబ్దులాపురం మీదుగా ఉమ్మాయిపల్లె వరకు ఉన్న పూర్తిగా దెబ్బతింది. అలాగే పేరుసోముల నుంచి కమ్మవారిపల్లె, పెద్దవెంతుర్ల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. రోడ్లపై పలు చోట్ల గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాల పాలవుతున్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న బీసీ జనార్ధనరెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో రోడ్లకు కొత్త రూపు వస్తుందనే ఆశతో మండల ప్రజలు, వాహన దారులు ఎదురుచూస్తున్నారు.